W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక





ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

8-4-2025



## పట్టాభిరాముడు.. పరవశింపజేసిన భద్రగిరి

03

- పట్టు వస్త్రాలతో గవర్నర్ శిరోమణి సేవ
- వేదఘోషతో మిథిలా ప్రాంగణం మార్మోగింపు
- శ్రీరామనవమి మహోత్సవాలకు ముగింపు మధురం
- రాజసూయంగా సాగిన రామ పట్టాభిషేకం
- భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా భద్రాచల వేడుకలు

భక్తి పరాకాష్ఠకు ప్రతీకగా నిలిచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, ఈసారి మరో ఘనోత్సవానికి వేదికయ్యాయి.

# తుమ్మల పర్ఫార్మెన్స్ ఢిల్లీ దాకా...

## తుమ్మల శ్రమకు తగిన గుర్తింపు

### మీనాక్షి నటరాజన్ నివేదికలో ప్రశంసలు



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తిరుగులేని శ్రద్ధా శక్తిగా నిలుస్తున్న వారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. నాలుగు దశాబ్దాల రాజకీయం, ప్రజా సేవ, అవినీతిరహిత పరిపాలన ఇవన్నీ ఆయనకు ప్రజల గుండెల్లో స్థానం కలిగించాయి. ఈయన పనితీరుపై తాజాగా ఏ ఐ సి సి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్వహించిన విశ్లేషణాత్మక సర్వేలో "వెరీ గుడ్" పర్ఫార్మెన్స్ రిపోర్ట్ రావడం పెద్ద సంచలనంగా మారింది. ఇది తుమ్మల వ్యక్తిత్వానికి, విధేయతకు, గ్రామీణ అభివృద్ధిపై ఆయన తీసుకుంటున్న చర్యలకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి వచ్చిన గౌరవంగా చెప్పవచ్చు.

**రైతులకు వెలుగు చూపిన నాయకుడు**

వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల గారు, రాష్ట్రానికి అవసరమైన ఆయిల్ పామ్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ, రైతులకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించే విధంగా పని చేస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ ద్వారా, ప్రత్యేకించి ఖమ్మం జిల్లాలోని చిన్న రైతుల జీవితాల్లో విశేష మార్పులు చోటు చేసు కుంటున్నాయి. ఇది తుమ్మల 'విజన్'కు ప్రతిరూపం.

08



## సింగరేణి నీటిబిందువు జల సింధువు

- సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల ఏర్పాటు, అభివృద్ధి
- భూగర్భ జలాల పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక
- నీటి కుంటలుగా మూత పడిన ఓ.సి. సంపులు
- ఓవర్ బర్డెన్ గుట్టల మధ్య నీటి తటాకాలు ఏర్పాటు
- ఎండకాలంలో కూడా సింగరేణి ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే ప్రయత్నం
- రెండు కిలోమీటర్ల పరిధిలో సహజ చెరువులు, కుంటల్లో నీటి నిల్వకు చర్యలు

09



02

## సింగరేణి చరిత్రలో కొత్తగూడెంఏరియా సంచలనం

**జీఎం శాలెం రాజ్ నాయకత్వంలో బొగ్గు ఉత్పత్తి**

**అభినందించిన కార్మికసంఘాలు, అధికారులు**

సింగరేణి కాలరీస్ చరిత్రలో అరుదైన మైలురాయిని కొత్తగూడెం ఏరియా అధిగమించింది. ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజ్ దూరదృష్టి, నాయకత్వ నైపుణ్యం, నిరంతర పర్యవేక్షణతో కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి మొత్తం 69 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

మహా పత్రిక
ANN తెలుగు



## బాధిత కుటుంబాలకు యువకుల సాయం

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలో పోలంపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వాంకుడోత్ లక్ష్మ, పేద వృద్దురాలల్కైన దారావత్ ఈరి కుటుంబాలకు ఆ గ్రామ యువత అండా నిలిచారు. యువకులు తలా కొంత పైకం వేసుకోని రెండు కుటుంబాలకు 50 కేజీల బియ్యం చొప్పున 100 క్వింటాళ్ల బియ్యాన్ని సోమవారం గ్రామ పెద్దల చేతుల మీదిగా బాధిత కుటుంబాలకు అందించారు. వాంకుడోత్ లక్ష్మ అనారోగ్యం మంచనా పడటం వైద్య ఖర్చులకు గ్రామస్తులు రూ.18వేల సాయం అందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్, బోడ అశోక్, జర్పుల ధోనీ, వినోద్, సక్రియ, వినాయక్, రాజ్‌కుమార్, నవీన్ ఆకాష్ పాల్గొన్నారు.

## గురుకుల సీటు సాధించిన విద్యార్థులు



**కారేపల్లి, మహా:** కారేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధించినట్లు హెచ్ఎం రమేష్ తెలిపారు. పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా వారిలో ముండ్ల శివరాజ్‌కుమార్, ఆదెర్ల రాగదీపక్‌లు గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి సీట్లు పొందారని తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులను హెచ్ఎం అభినందించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు వివిధ ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగదీప్తి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి చరిత్రలో కొత్తగూడెం ఏరియా సంచలనం

## జీఎం శాలెం రాజ్ నాయకత్వంలో రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి

## అభినందించిన కార్మికసంఘాలు, అధికారులు

**మహా, కొత్తగూడెం:** సింగరేణి కాలరీస్ చరిత్రలో అరుదైన మైలురాయిని కొత్తగూడెం ఏరియా అధిగమించింది. ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజ్ దూరదృష్టి, నాయకత్వ నైపుణ్యం, నిరంతర పర్యవేక్షణతో కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి మొత్తం 69 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్పత్తి మరియు రవాణాలో రికార్డులు నమోదు చేస్తూ, సింగరేణిలోనే అత్యధిక ఉత్పత్తి చేసిన ఏరియాగా చరిత్ర సృష్టించింది. మణుగూరు ఏరియా రెండవ స్థానంలో నిలవగా, కొత్తగూడెం ఏరియా గడిచిన కొన్ని సంవత్సరాల ఉత్పత్తి రికార్డులను తిరగరాస్తూ, సింగరేణికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా జీఎం శాలెం రాజ్ మాట్లాడుతూ గడిచిన ఆరు నెలలుగా ప్రతి రోజు స్వయంగా పర్యవేక్షణ, పరిశీలన, అధికారుల సమన్వయం ద్వారా ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేశామన్నారు. ప్రతిరోజూ సత్తుపల్లి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టడం, ఉద్యోగులతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తూ పరిపాలనలో ఆవశ్యకమైన అన్ని అంశాలపై నిత్యం చురుగ్గా స్పందించడం, అధికారులు పరుగులు పెట్టేలా చేయడం వంటి కృషితో ఈ విజయం సాధించామన్నారు. గత నాలుగు నెలలుగా నిరంతరంగా ఉత్పత్తిలో పెరుగుదల నమోదు కాగా, సింగరేణిలోని ఇతర ఏరియాలకు కొత్తగూడెం ఆదర్శంగా నిలిచింది. 24 గంటలూ ఉత్పత్తి పై దృష్టిసారిస్తూ, సుదీర్ఘ మంతనాలు, సమాలోచనలు జరుపుతూ, తన దూర దృష్టితో జీఎం శాలెం రాజ్ సింగరేణి చరిత్రలో సరికొత్త ఆల్ టైం రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా ఐఎన్ టియుసి కార్మిక నాయకుడు ఆకునూరి కనకరాజు జీఎం శాలెం రాజ్ ని స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ విజయంతో కొత్తగూడెం ఏరియా మాత్రమే కాకుండా మొత్తం సింగరేణి ప్రతిష్టను మరింత పెంచిన శాలెం రాజ్ కి ఉద్యోగ వర్గాలు, కార్మిక సంఘాలు, సీనియర్ అధికారులందరూ అభినందించారు.



## రైతులకు సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలి

**పెనుబల్లి, ఏప్రిల్ - 07, మహా:** రైతులకు ఎలాంటి వాతావరణ పరిస్థితుల ప్రభావం వలన ఇబ్బందులు కలుగకుండా పంటకు లాభాలు పెంచడమే లక్ష్యంగా యంత్రాంగం సమన్వయంతో ముందస్తు కార్యచరణ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, పెనుబల్లి మండలంలో పర్యటించారు. పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలోని లంకాసాగర్ చిన్న తరహా ప్రాజెక్ట్ ను రైతులు, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. లంకాసాగర్ ప్రాజెక్ట్ కట్టపై కలెక్టర్, బైక్ పై ప్రయాణించి క్షేత్రస్థాయిలో నీటి లెవల్స్ ను పర్యవేక్షించారు. రైతులతో కలెక్టర్ ముచ్చటిస్తూ వాస్తవ పరిస్థితులను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ కట్టిన తర్వాత ఇంతవరకు సిల్ట్ తొలగించలేదని సిల్ట్ తొలగిస్తే వాటర్ స్టోరేజ్ పెరుగుతుందని రైతులు కలెక్టర్ కు వివరించారు. లంకాసాగర్ ప్రాజెక్టు ప్రతిపాదనలు తనకు పంపాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ అదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పంట మార్పిడి పద్ధతిని అలవార్చుకోవాలని లాభాలు వచ్చే పంటలపై దష్టి సారించాలన్నారు. లంకాసాగర్ ప్రాజెక్ట్ వద్ద టూరిజం అభివృద్ధి కి సాధ్యాసాధ్యాలు అంచనా వేస్తామని తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా వేసిన పంట వలన రైతులు నష్టపోతున్నారని, రైతులు ఏ పంట పండించాలనే అంశంపై విస్తృతంగా చర్చ పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. వరిపై రైతులు అధికంగా ఆధారపడటం మంచిది కాదని అన్నారు.



# పరవసించిన భద్రగిరి

**పట్టు వస్త్రాలతో గవర్నర్ శిరోమణి సేవ**

**వేదఘోషతో మిథిలా ప్రాంగణం మార్మోగింపు**

**శ్రీరామనవమి మహోత్సవాలకు ముగింపు**

**రాజసూయంగా సాగిన రామ పట్టాభిషేకం**

**భక్తుల హృదయాల్లో భద్రాచల వేడుకలు**

**ఖమ్మం - మహా:** భక్తి పరాకాష్ఠకు ప్రతీకగా నిలిచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, ఈసారి మరో ఘనోత్సవానికి వేదికయ్యాయి. కల్యాణ రాముడు నేడు రారాజుగా పట్టాభిషేకం చెంది, భక్తులను భక్తిరస గర్భిత అనుభూతులతో పరవశింపజేశాడు. మిథిలా ప్రాంగణం వేదమంత్రోచ్చారణలతో మార్మోగింది. గౌతమీ తీరపు పవిత్ర తీర్థాలతో, రాజ లాంఛనాలతో, శిల్పకళా మండపంలో స్వామివారి శిరసుకు రత్న కిరీటాన్ని ధరింపజేయడం దృశ్యకావ్యంలా మారింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్వయంగా పట్టు వస్త్రాలను సమర్పిస్తూ రామసేవలో నిమగ్నమయ్యారు. రాష్ట్రస్థాయి నేతలు, అధికారులు, దూరదూరాల నుంచి చేరుకున్న భక్తులు కలసికట్టుగా శ్రీరాముని రామరాజ్య ఉద్భవాన్ని కళ్లారా వీక్షించి ఆనందాశ్రువులతో వెనుదిరిగారు. ఇది కేవలం వేడుక కాదె, రామనామ పరాకాష్ఠకు అద్దంపట్టే అద్భుత మహోత్సవం.

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్య ఘట్టమైన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, సోమవారం భద్రాచలం మిథిలా ప్రాంగణంలో అత్యంత వైభవంగా, భక్తిపూరితంగా జరిగింది. పల్లకీ సేవలతో మొదలైన కార్యక్రమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య రాజ లాంఛనాలతో సాగి, భక్తుల హృదయాలను పులకింపజేశాయి.



భజనలు, భజంత్రీల సందడి మధ్య స్వామివారిని ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకొచ్చారు. శిల్పకళా మండపంపై స్వామివారిని వేంచేయగా, అక్కడే విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన నిర్వహించారు. రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలతో స్వామివారికి రామరాజ్య అభిషేకం జరిపారు. స్వామివారి శిరస్సు పై కిరీటాన్ని అలంకరించడంలో నభసి మిణుగురు మెరిసినట్లు, భక్తులు ఆనందాభిప్రాయాలు వెలిబుచ్చారు. ఈ వేడుకకు హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాన్ని దర్శించి, అనంతరం మిథిలా ప్రాంగణంలో జరిగే పట్టాభిషేక ఘట్టాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పిఓ రాహుల్, ఈవో రమాదేవి తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## మహాకుంభ తీర్థప్రోక్షణ

తొలుత అర్చకులు రామాలయంలోని భద్రుని మండపంలో స్వామివారి పాదుకలకు అభిషేకాన్ని నిర్వహించారు. పవిత్ర గౌతమీ నదీ తీరానుండి తీర్థములను తెప్పించి, పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ జరిపారు. ఈ సందర్భంగా ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, ఆదరణ వేదం, విష్ణుపురాణం, భాగవత శాస్త్రంతో పాటు, శ్రీరామ పట్టాభిషేకం పారాయణం ఆలపించబడింది.

## ప్రధాన ఘట్టాలు విజయవంతం

వేడుకల సమయంలో భద్రాచలంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత కట్టుదిట్టంగా సాగాయి. జిల్లా యంత్రాంగం సమన్వయంతో రామనవమి బ్రహ్మోత్సవాల్లోని ప్రధాన ఘట్టాలను విజయవంతంగా నిర్వహించారు. భక్తులపై అర్చకులు పుణ్యజలాలు చల్లినపుడు వారి కళ్లలో నిండిన ఆనందభాష్పాలు భక్తి పరవశానికి నిదర్శనంగా నిలిచాయి.

# గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



**కూసుమంచి, ఏప్రిల్ 7, మహా:** పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో చాలా వరకు అనేక వీధులలో సీసీ రోడ్లు,సైడ్ డ్రైనేజీలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎంపీ అభివృద్ధి నిధులను కేటాయించి సీసీ రోడ్లను, సైడ్ డ్రైనేజీలను మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని నేల కొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్ ఆధ్వర్యంలో.. ఆదివారం ఖమ్మంలోని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి ని వారి నివాసం లో గ్రామస్థులు కలిసి ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని అభ్యర్థించారు. గ్రామస్థుల విన్నపం పై స్పందించి సురేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేను త్వరిత గతిన ఎంపీ రామసహాయం రఘు రామ్ రెడ్డి కి విషయాన్నీ తెలియ పరిచి సీసీ రోడ్లకు, సైడ్ డ్రైనీజీకి ఎస్టిమేషన్ వేయించి తగినన్ని నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులను పేరుపేరునా అడిగి వారియొక్క యోగక్షేమాలు, ఆర్థిక స్థితిగతుల వివరాలు తెలుసుకొన్నారు. తొలుత గ్రామస్థులు అంతా ఆయనకు శ్రీరామ నవమి శుభాకంక్షాలు తెలిపారు. ప్రతిగా మాజీ ఎంపీ గ్రామస్థులకు నవమి శుభాకాంక్షలు తెలిపి, అంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని, వారికీ అన్ని రకాలుగా కలిసి రావాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమం లో నెలకొండ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, మాజీ సర్పంచ్ రెడ్డిమల్ల రవణమ్మ, వెంకన్న, తెలంగాణ బీసీ సంఘం పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ పోశం నాగార్జున, కాంగ్రెస్ నాయకులు కొండపర్తి కమలాకర్, నర్రా కోటయ్య పాల్గొన్నారు.

# ఏప్రిల్ 9న జాబ్ మేళా నిర్వహణ

- అపోలో ఫార్మసీ లో 100 ఉద్యోగ ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహణ
- జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**ఖమ్మం - మహా:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం అపోలో ఫార్మసీలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 9న (బుధవారం) ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సోమవారం తెలిపారు. హైదరాబాద్, ఖమ్మంలో పని చేసే విధంగా అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్ గా పని చేయుటకు 18-35 సంవత్సరాల వయస్సు గల డి ఫార్మసీ / బి ఫార్మసీ / ఎం ఫార్మసీ (పి.సి.ఐ.) అర్హత గలవారు, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులకు పదవ తరగతి అర్హత గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 11 వేల నుండి 25 వేల వరకు ఉంటుందని అన్నారు. మొత్తం దాదాపు 100 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి పేర్కొన్నారు.



# అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**ఖమ్మం - మహా:** ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన చీకటి శ్రీను తమ భూమి, బావి సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్ కేనాల్ క్రింద పోయాయని, బావికి సంబంధించిన పరిహారం సొమ్ము జమ కావడం లేదని, వీటిని ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ, పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం కొదుమూరు గ్రామానికి చెందిన తాళ్లూరి వెంగళరావు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 112/ఏ లో 5 ఎకరాలలో మూడు ఎకరాల్లో గ్రీన్ హైవేకు వెళ్లాయని, తమ భూములకు అవసరమైన సర్వీస్ రోడ్డును వెంటనే నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, చింతకాని మండల తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ బడే సాహెబ్ తాను దివ్యాంగుడినని, తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ మండల తహసిల్దార్ కు రాస్తూ విచారించి చర్యలు తీసుకోవాలని అన్నారు.



# విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించాలి

- మండల కేంద్రాలలో ప్రతి క్వార్టర్ కెరీయర్ గైడెన్స్ పై అవగాహన కల్పన
- గ్రామాలలో రీడింగ్ రూమ్స్ నిర్వహణకు ప్రణాళిక తయారు చేయాలి
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం - మహా:** 8వ తరగతి నుంచి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి లైబ్రరీ, రీడింగ్ రూమ్స్, మా పాప- మా ఇంటి మణిదీపం, సన్న బియ్యం, తదితర వాటిపై జిల్లా అధికారులతో సమీక్షించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో చదివే పిల్లలకు కెరీయర్ గైడెన్స్ అందించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, 8వ తరగతి నుంచి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో రీడింగ్ రూమ్స్ ఏర్పాటు, వాటి నిర్వహణకు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పంచాయతీ శాఖ పరిధిలో పారిశుధ్య కార్మికులందరికీ ప్రమాద బీమా తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ స్టాఫ్ కు భీమా కల్పించాలని కలెక్టర్ తెలిపారు. మా పాప- మా ఇంటి మణిదీపం కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆడ పిల్లలకు పోస్టాఫీసు సుకన్య సమృద్ధి యోజన క్రింద ఖాతా ఓపెన్ చేయించాలని అన్నారు. సన్న బియ్యం లబ్ధిదారులు కూడా ఆడపిల్ల పుట్టిన కుటుంబంలో ఉంటే అధికారులు వారితో భోజనం చేసి రావాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో ఎన్. సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 50 పడకల ఆసుపత్రి స్థలం పరిశీలన

**ముదిగొండ ఏప్రిల్ 7 మహా:** మండల కేంద్రమైన ముదిగొండ పిహెచ్సి ఆవరణంలో 50 పడకల ఆసుపత్రి స్థలాన్ని తాహశీల్దార్ కొక్కుల సునీత ఎలిజిబెత్ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా పిహెచ్సిలో 50 పడకల నిర్మాణ స్థలాన్ని ఆమె పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం పిహెచ్సిని 50 పడకల ఆసుపత్రిగా పెంచుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే.ఆమె వెంట సర్వేయర్ పెసర ఉమామహేష్,కమ్యూనిటీ హెల్త్ సెంటర్ టీఎస్ ఎంఎస్ఐడిసి ఏఈ జమలయ్య,సిహెచ్ఓ సిహెచ్ మధుసూదన్ రావు ఉన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చర్ల, మహా:** చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పిఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవి కుమార్ ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..సంఘం పరిధిలోగల రైతులు రబీ ధాన్యాన్ని చర్ల కొనుగోలు కేంద్రంలో అమ్ముకుని మద్దతు ధర పొందాలని



కోరారు.అలాగే సన్న వడ్లకు ప్రభుత్వం క్వింటాల్ కు రూ,500 ల బోనస్ ఇవ్వనుందని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ కి రూ,2320/-లు,దొడ్డు రకం వడ్లకు క్వింటాల్ కి రూ,2300/- ల మద్దతు ధర ఉందన్నారు. వ్యవసా య అధికారిని ఎస్. లావణ్య, ఏఈఓ లు ఎం.డి అఫ్రిద్, ఏ.రామకృష్ణ సంఘం కార్యదర్శి ఎస్డీ జిలానీ,రైతులు మేడిచర్ల సత్యనారాయణ, ముత్యాల విశ్వేశ్వర రావు,ముత్యాల సంపత్,శీలం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక కూపన్ల వెనుక కోట్ల మాయ

చిన్నమండవ స్కాం బహిర్గతం

కూలీల రక్తస్వేదం దోపిడీ.. ఇసుక మాఫియా రాజ్యం

ర్యాంప్ కుంభకోణంపై రెవెన్యూ వ్యవస్థపై మచ్చ

ఉచిత పర్మిట్ల పేరుతో లూటీ ఖజానాకు కత్తెరలు

మౌనంగా అధికారులు, దూకుడుగా మాఫియా

**ఖమ్మం - మహా:** తెలంగాణలో ఇసుక మాఫియా విజృంభణ కొనసాగుతోంది. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని చిన్నమండవ గ్రామంలో గత మూడేళ్లుగా జరుగుతున్న ఇసుక కూపన్ల వ్యవహారం కేవలం రెవెన్యూ వ్యవస్థ పతన గాథనే కాదు, కూలీల రక్తస్వేదాన్ని దోచుకున్న దారుణ కథ కూడా. సమాచార హక్కు చట్టం ద్వారా బయటపడిన లెక్కలు ఒకవైపు కోట్ల రూపాయల ప్రజాధనం లూటీని సూచిస్తుండగా, మరోవైపు ఇసుక కూలీలకు చెందాల్సిన లక్షల రూపాయలు స్థానిక నాయకులు, అధికారుల చేతుల్లోకి మళ్లిన దుర్మార్గాన్ని వెల్లడిస్తున్నాయి. ఈ కథనం ఒక గ్రామంలోని ఇసుక ర్యాంప్ వెనుక దాగిన మాయలోకాన్ని, అధికార దుర్వినియోగాన్ని, కూలీల అసహాయతను వివరిస్తుంది.

### చిన్నమండవ ఇసుక స్కాం...

ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని చిన్నమండవ గ్రామంలో ఇసుక తవ్వకాలు, కూపన్ల వ్యవహారం ఒక సాధారణ అడ్మినిస్ట్రేటివ్ లోపంగా కనిపించినా, లోతుగా తవ్వితే అది ఒక సంఘటిత మాఫియా వ్యవస్థగా బయటపడింది. ఇక్కడ జారీ అయిన 8078 కూపన్ల ద్వారా రూ. 85,70,758 వసూలైనట్లు తహసిల్దార్ కార్యాలయం వెల్లడించినా, ఈ లెక్కల్లో అనేక లొసుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ కుంభకోణంలో అత్యంత దారుణమైన అంశం ఏమిటంటే, ఇసుక కూలీలకు చెందాల్సిన సుమారు 40 లక్షల రూపాయలు పక్కదారి పట్టడం.కూపన్ వెనుక లెక్కలు – కూలీలకు అన్యాయంప్రతి ఇసుక కూపన్ ధర రూ. 1061గా నిర్ణయించబడగా, దీనిలో లోడింగ్ ఛార్జ్‌గా రూ. 400, గ్రామ పంచాయతీ ఫండ్‌కు రూ. 400, జిల్లా పరిషత్‌కు రూ. 120 వంటి విభజనలు చేయబడ్డాయి. అయితే, ఈ లెక్కల ప్రకారం ఇసుక కూలీలకు లోడింగ్ ఛార్జ్‌ల కింద సుమారు 40 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండగా, ఆ నిధులు ఎక్కడికి పోయాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష నాయకులు, పంచాయతీ అధికారులు కలిసి ఈ సొమ్మును దారి మళ్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆటంకం. ఇసుక కూలీలు తమకు రావాల్సిన లోడింగ్ ఛార్జీల గురించి ప్రశ్నించినప్పుడు, వారిని బెదిరించే ప్రయత్నాలు జరిగాయి. “మీరు ఈ డబ్బుల గురించి అడిగితే, దళిత బంధు ఎలా వస్తుందో చూస్తాము” అంటూ స్థానిక నాయకులు హెచ్చరించినట్లు సమాచారం. ఈ బెదిరింపుల వెనుక గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకుల కలిసికట్టుతనం కనిపిస్తోంది. కూలీల హక్కులను కాపాడాల్సిన వారే వాటిని దోచుకుని, పైగా బెదిరింపులకు దిగడం ఈ స్కాంలోని మరో దుర్మార్గమైన కోణాన్ని వెల్లడిస్తుంది.ఆర్ టి ఐ తో బయటపడిన సత్యాలు2021 నవంబర్ 10న గుండ్ల రాంబాబు అనే రైతు సమాచార హక్కు చట్టం ద్వారా తహసిల్దార్ కార్యాలయాన్ని ప్రశ్నించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 8078 కూపన్ల ద్వారా వసూలైన రూ. 85.70 లక్షల్లో గ్రామ పంచాయతీ ఖాతాలోకి రూ. 64.50 లక్షలు డిడి రూపంలో జమ చేసినట్లు అధికారులు చెప్పారు. కానీ, ఈ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయి? ట్రాక్టర్ ఛార్జీల కోసమేనా? లేక ఇతర అక్రమ లావాదేవీలకా? అన్నది స్పష్టత లేని అంశంగా మిగిలిపోయింది.

## ఉచిత పర్మిట్ల పేరుతో లూటీ

రైతు వేదికలు, 2బి హెచ్ కే ఇళ్లు, శ్మశానవాటికలు, నర్సరీల పేరుతో ఉచిత పర్మిట్లు జారీ చేస్తూ రాజకీయ ఒత్తిళ్లతో కోట్ల రూపాయలను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పర్మిట్ల వెనుక ఎవరి ప్రభావం ఉంది? రికార్డులు ఎందుకు అందుబాటులో లేవు? అన్న ప్రశ్నలకు అధికారులు మౌనంగా ఉండటం సందేహాలను మరింత బలపరుస్తోంది.

## రెవెన్యూ వ్యవస్థలో లోపం... అధికారుల మౌన ఒప్పందం

ముద్రణ ఖర్చులు, అడ్మినిస్ట్రేషన్ ఛార్జీలు, లోడింగ్ ఖర్చుల పేరుతో వసూలు చేసిన లక్షల రూపాయల్లో కొంత భాగం మాత్రమే ఖర్చు చూపించి, మిగిలిన సొమ్ము మాయమైంది. ఉదాహరణకు, ముద్రణ ఖర్చులకు రూ. 4,03,800 చూపగా, కేవలం రూ. 70,000 మాత్రమే ఖర్చై, మిగిలిన రూ. 3,33,800 ఎక్కడికి పోయింది? ఇలాంటి అనేక లెక్కల్లో అవకతవకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో తహసిల్దార్ కార్యాలయం మౌనంగా ఉండటం, స్థానిక నాయకుల మద్దతు ఉన్నట్లు సమాచారం ఉండటం ఒక రాజకీయ-అధికార ఒప్పందాన్ని సూచిస్తోంది.

# పిఆర్‌టీయూ గెలుపులో రమణ పాత్ర కీలకం






**మహా భద్రాచలం:** ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పి ఆర్ టీ యూ విజయం సాధించడంలో ఉపాధ్యాయుడు కే వి రమణ కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉపాధ్యాయులందరిని ఒకే తాటిపైకి తీసుకుని వచ్చి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గెలుపుకు ప్రధాన భూమిక వహించారు. రమణ పి ఆర్ టీ యూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా భాద్యతలు నిర్వహిస్తున్నారు. కాగా రమణ యూనియన్ కు చేస్తున్న సేవలను గుర్తించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సోమవారం తన ప్రమాణ స్వీకారానికి ముందు రమణ ను ఘనంగా సన్మానించారు. ఈ గౌరవం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రమణ కు మాత్రమే దక్కడం విశేషం. ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి కి రమణ భద్రాద్రి రామయ్య ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టీ యూ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధనకొండ శ్రీనివాస్,యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు అమర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, పి ఆర్ టీ యూ పత్రిక ఉప సంపాదకులు చిత్తూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ముదిగొండ ఏప్రిల్ 7 మహా:** మండలపరిధిలోని మేడేపల్లి,కట్టకూరు గ్రామాలలో సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ సునీతా ఎలిజబెత్,మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు సోమవారం లాంఛనీయంగా ప్రారంభించారు.ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామల రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి,అమ్మి మోసపోవద్దని ఆయన కోరారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు.ఈకార్యక్రమంలో సొసైటీ సీఈవో భాగం శ్రీనివాసరావు,సొసైటీ వైస్ చైర్మన్ నాగిరెడ్డి,మేడేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సామినేని రమేష్,సొసైటీ డైరెక్టర్స్ పోటు ప్రసాద్, మోర్తాల రవీందరరెడ్డి,కట్టకూరు గ్రామ మాజీ సర్పంచ్ తోట వెంకటేశ్వర్లు,కొత్తపల్లి నాగార్జున, మహిళా అధ్యక్షురాలు తోట నాగేంద్ర,ఏఈఓ ఏ మౌనిక,రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎస్కె వహీదాసుల్తానా సొసైటీ క్లర్కు సురభి బిక్షం పలువురు రైతులు పాల్గొన్నారు.



## పిల్లల కోసం సమయం కేటాయించండి



**సత్తుపల్లి, ఏప్రిల్ 7: మహా:** చిన్ననాటి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని , అందుకు వారికి రోజులో కొంత సమయం కేటాయించాలని, పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ అత్యంత ముఖ్యమని సత్తుపల్లి మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ జే .ఎన్. శ్రీనివాసరావు అన్నారు. విశ్వశాంతి విద్యాలయంలో సోమవారం "గ్రాడ్యుయేషన్ డే" వేడుకలు నిర్వహించారు. ప్రీ ప్రైమరీ తరగతులు ముగించుకొని ప్రైమరీ విభాగంలోనికి ప్రవేశిస్తున్న సందర్భంగా యూకేజీ విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశంస పత్రము, మెడల్స్, బొకేతో అభినందించారు.

## రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వ వైఖరి సరికాదు



**ఖమ్మం - మహా:** రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వ వైఖరి సరి కాదని అనేక మంది అర్హులకు రేషన్ కార్డులు రాకుండా చేసే ప్రయత్నం జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. రకరకాల కారణాలతో రేషన్ కార్డులను అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ నగర సమితి సభ్యుల సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగింది. సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు రేషన్కార్డులను ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను సన్మానించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ



**మహా భద్రాచలం:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మ భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి పట్టాభిషేకానికి వచ్చిన సందర్భంగా భద్రాచలంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డా.ఎస్.ఎల్.కాంతారావు, వి.శ్రీనివాసరావు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, వై. సూర్యనారాయణ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్, జి.రాజారెడ్డి, ట్రెజరర్, గాలిబ్, జి.సంజీవరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కాగారును నిలుపుదల చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం - మహా:** ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ ను తక్షణమే నిలిపివేయాలని, కోరుతూ, ఈ నెల 25 న భద్రాద్రి కొత్తగూడెం కేంద్రంలో జరిగే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బానోత్ ఉక్లా, కొత్తగూడెం సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి సురేందర్ లు వాల్ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండ పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, "అఖిలభారత రైతు కూలీ సంఘం", ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ" ల ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం లో జరుగు సదస్సును జయప్రదం చేయాలని కోరారు .



# పరిపాలనా ప్రతిభకు తుమ్మల ప్రశంసలు

**భద్రాచలం కళ్యాణ విజయానికి అధికారులు కీలకం**

**శ్రమకు గౌరవంగా మంత్రి అభినందన**

**భద్రతా ఏర్పాట్లకు మంత్రి ముద్రా**

**కళ్యాణం విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగం**

**ఖమ్మం - మహా:** ఆధ్యాత్మిక వైభవానికి మారుపేరైన భద్రాచలం రామాలయం, శ్రీ సీతారాముల కల్యాణోత్సవంతో మళ్లీ ఒక భక్తి పర్వదినంగా మారింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి కలతలేకుండా, అత్యంత శ్రద్ధతో ఈ మహోత్సవం నిర్వహించబడడం పాలనా సమర్థతకు నిలువెత్తు నిదర్శనం. ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరై, భక్తులతో కలసి తానూ ఒక భాగమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా పోలీసు అధికారి రోహిత్ రాజ్‌లు చూపిన ముందస్తు ప్రణాళిక, కట్టుదిట్టమైన ఏర్పాట్లకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా ప్రశంసలు తెలిపారు. ఇది కేవలం పాలనా బాధ్యతలు మాత్రమే కాదు, ఒక ఆధ్యాత్మిక సేవగా కూడా భావించవలసిన అంశం. శ్రీ సీతారాముల కళ్యాణానికి లక్షలాది భక్తులు భద్రాచలానికి తరలివచ్చిన వేళ, యావత్ జిల్లా యంత్రాంగం ఒక కుటుంబంలా పనిచేసి ఈ మహోత్సవాన్ని ఘనవిజయంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి హాజరైన ఈ సందర్భాన్ని ప్రశాంతంగా, విశ్రాంతంగా కొనసాగించడానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా పోలీసు అధికారి రోహిత్ రాజ్ లు ముందుగానే సమగ్ర ప్రణాళిక రచించారు. సోమవారం పుణ్యక్షేత్రానికి గౌరవనీయ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాక సందర్భంగా, ఆయనకు స్వాగతం పలికేందుకు హెలికాప్టర్ దిగి వచ్చిన ప్రదేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేరుకున్నారు. అక్కడే కలెక్టర్, ఎస్.పీల చేతులు గట్టిగా పట్టుకొని, "శుభాభినందనలు.. మీ సేవ అమోఘం.. బాగా నియంత్రించారు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. పవిత్ర కళ్యాణ మహోత్సవాన్ని ఎలాంటి ఆటంకాలూ లేకుండా పూర్తి చేయడం కోసం చేసిన సమిష్టి కృషికి మంత్రిగారి అభినందనలే ఉత్తమ గుర్తింపు. భద్రాచలం పరిపాలన విధానానికి ఇది మరో విజయపుట.



### ప్రత్యేకంగా మెచ్చుకోవాల్సిందే

మంత్రి మాట్లాడుతూ "నెల రోజుల కృషి, అనుసంధానంతో ఏర్పాట్లు కచ్చితంగా అమలయ్యాయి. ముఖ్యమంత్రి పర్యటన, భక్తుల రాకతో భారీ భద్రత, సమన్వయం అవసరమైన వేళ, అధికారులు బాగా సమర్థత చూపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసిన విధానం ప్రత్యేకంగా మెచ్చుకోవాల్సిందే" అన్నారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి ఏర్పాట్లు, తాత్కాలిక వైద్య కేంద్రాలు, దివ్యదర్శన ఏర్పాట్లు, మేడాగదుల పంపిణీ ఎ అన్నింటిలోనూ సమర్థంగా వ్యవహరించిన జిల్లా యంత్రాంగం, రాష్ట్ర పాలనకు ఆదర్శంగా నిలిచింది. ఈ క్రమంలో పోలీసు శాఖ నిస్సీమంగా పనిచేసిన తీరు ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. మహిళా పోలీసులు, ప్రత్యేక దళాలు, నిఘా పటాళాలు క్షేత్ర స్థాయిలో పటిష్టంగా వ్యవహరించాయి.

# పట్టాభిషిక్తుడైన రామయ్య

## పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్

### గిరిజన మ్యూజియం ప్రారంభించిన జిష్ణు దేవ్ వర్మ





**మహా భద్రాచలం:** భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం కన్నుల పండుగగా జరిగింది.అశేష భక్త జనులు పట్టాభిషిక్తుడైన రామయ్యను చూసి పులకించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మిథిలా స్టేడియం లోని కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరగగా, అదే వేదికపై సోమవారం పుష్యమి నాడు రామయ్యకు మహా పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టాభిషేకం జరుగుతుండగా రామయ్య రాజసం చూసి భక్తులు పరవశించిపోయారు.ఈ ఉత్సవానికి తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాజ్యాధికారి హోదాలో పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సోమవారం రామాలయంలో ఉదయం నిత్య విధి అనంతరం 10 గంటలకు మిథిలా స్టేడియం లోని ప్రాకార మండపంలో వేంచేపు చేసి అలంకార ఆరాధన గావించి , నిర్విఘ్నతాసిద్ధి కొరకుశ్రీ విశ్వక్సేనార్చన, ద్రవ్యశుద్ధి కొరకు పుణ్యాహ వచనము ముగించుకొని పుణ్యాహజలములచే పట్టాభిషేక ప్రక్రియ ఆరంభించారు . ఇందుకుగాను మంటపారాధన గావించి మంటపమునందు ముందు చతుస్సముద్రోదక కలశములు మధ్యయందు 500నదుల తీర్థ కలశములను (శ్రీమద్రామయణము నందు తెలుపబడినట్లు) స్థాపించి, అర్చించి, పట్టాభిషేక సర్గపారాయణ గావించి అనన్తరము ఆయా కలశ ఉదకములచే పట్టాభిషేక మంత్ర పఠన పూర్వకముగా శ్రీస్వామి వార్కి పట్టాభిషేకము జరిపి, స్వర్ణకిరీట, పాదుకా, హేరీరాదులు, ఛత్రచామరాది లాంఛనములు సమర్పించి నివేదన గావించి మంగళ నీరాజనములతో పట్టాభిషేక ప్రక్రియ ముగించారు . భక్తులపై మంత్ర జలాన్ని చిలకరించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే లు వెంకట్రావు, కోరం కనకయ్య,కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్ పి రోహిత్ రాజ్ స్వాగతం పలికారు. గవర్నర్ ఐ టీ సి గెస్ట్ హౌస్ నందు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్వామి వారిని దర్శించుకుని పట్టాభిషేక మహోత్సవంకు హాజరయ్యారు.పట్టాభిషేకం అనంతరం ఐ టీ డి ఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియం ను ప్రారంభించారు.సాయంత్రం స్వామి వారికి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

## కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన



**భద్రాద్రి కొత్తగూడెం - మహా:** సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సింగరేణి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియా జి.ఎం. ఎం.షాలేం రాజు అధ్యక్షతన కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ ఎం పరశురాములు సమక్షంలో, కొత్తగూడెం ఏరియాలోని జిఎం కార్యాలయ సిబ్బందికి మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి .లలిత అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరు వారి వారి వ్యక్తిగత జీవితాలలో మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు, అలాగే శారీరక శ్రమ అనగా వ్యాయామం తప్పనిసరిగా వారి వెసులుబాటును బట్టి ఉదయం, సాయంత్రం సమయాన్ని కేటాయించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఫిట్ సెక్రెటరీ సిహెచ్. సాగర్, ఏఐటియుసి ఫిట్ సెక్రెటరీ కే.సౌజన్య, ఎజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) బి.శివ కేశవరావు, డిజిఎం (ఐఈడి) ఎన్.యోహన్, ఎస్ఓఎం ఎన్విరాన్మెంట్ తోట సత్యనారాయణ, ఇంచార్జ్ పర్చేస్ బి. మాధవ్, ఇంచార్జ్ క్వాలిటీ మదన్మోహన్, డాక్టర్ ఎం.పరశురాములు, మెడికల్ సూపర్డెంట్, డాక్టర్ డి.లలిత, హెల్త్ ఆఫీసర్, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. థావురియా మరియు జిఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికోద్యమ శిఖరం బీటీ రణదీవే

**భద్రాద్రి కొత్తగూడెం - మహా:** కార్మిక ఉద్యమ పితామహుడు బిటీ రణదీవే ఆశయ సాధన కోసం ఆయన కన్న కలల సాకారం కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలనీ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు డి వీరన్న, సూరం ఐలయ్య , భూక్య రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సింగరేణి అడ్డాల మీద అమరజీవి కామ్రేడ్ బిటి రణదీవే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న, ఐలయ్య, రమేష్ లు మాట్లాడుతూ, కార్మిక ఉద్యమం నిర్మాతల్లో ఒకరైన బీటీ రణదీవే కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశాడని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రైవేటు యాజమాన్యాలను నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ కార్మికుల హక్కుల కాలరాస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికుల ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చిన మహోన్నతమైన వ్యక్తి బీటీ రణదీవే అని వారు అన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు భూక్య రమేష్ , గుగులోత్ సక్రం, భంగి ,భాస్కర్, ప్రభాకర్, రాణి, స్వాతి, వెంకటేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంతో ఆనందదకర జీవితం

**భద్రాద్రి కొత్తగూడెం - మహా:**



మారుతున్న కాలానికి అనుగుణంగా ఆరోగ్య సమస్యలపై అవగాహనతో మెలుగుతూ, ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన మరియు ఆనందభరితమైన జీవితాన్ని సాగించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. సోమవారం స్థానిక బాబు క్యాంప్ గవర్నమెంట్ హైస్కూల్ లో "ప్రపంచ ఆరోగ్య దినోత్సవ" సందర్భంగ జరిగిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యం.. అని ఆరోగ్యానికి మించిన సంపద లేదని అన్నారు. ఆరోగ్య సమస్యలు లేని జీవితాన్ని గడపాలంటే ఖచ్చితంగా మన జీవనశైలి పద్ధతులను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం మరియు తగినంత నీరు త్రాగడం ద్వారా శారీరక పనితీరు సక్రమంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం

**బోనకల్,మహా:** మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ డెమో హౌస్‌ను సోమవారం ఆర్ అండ్ బి ఏఈ శ్రీకాంత్ మండల తాహాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్,ఎంపిడిఓ రురావత్ రమాదేవిలు మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు,ఆర్అండ్ బి ఏఈ శ్రీకాంత్ 75 రోజుల గృహ నిర్మాణాన్ని దశలవారీగా మోడల్ హౌస్ నిర్మాణాన్ని గురించి పంచాయతీ కార్యదర్శులకు వివరించారు..మోడల్ ఇల్లు ప్రకారం,కొత్తగా మంజూరైన లబ్ధిదారులు తమ ఇళ్లను గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్మాణాన్ని చేపట్టవలసి ఉంటుందని తెలిపారు,ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ఇల్లు పూర్తయ్యే వరకు పంచాయతీ కార్యదర్శులు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులకు నిర్దేశించిన సమయంలో తెలపాల్సి ఉంటుందన్నారు, ఎంపీఓ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, జూనియర్ అసిస్టెంట్స్ దామాల విజయరాజు,రజిత మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



## పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చు

**వైరా - మహా:** విద్యార్థులు పుస్తకాలు చదవడం దినచర్యగా అలవర్చుకోని, బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. వైరా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ, గ్రౌండ్, లైబ్రరీ, టాయిలెట్స్, త్రాగునీరు, కిచెన్ షెడ్ లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్త, శిధిలాల వ్యర్థాలు ఏమిటని ప్రధానోప్యాయుని ప్రశ్నించారు. పాఠశాల ఆవరణ ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని, పాఠశాల పక్కన ఉన్న గ్రౌండ్ లోని పిచ్చి మొక్కలను తొలగించి, స్థలం చదును చేసి వాడుకలోకీ తీసుకొని రావాలని సూచించారు. ఇంత సువిశాలమైన గ్రౌండ్ ఉందని, దీనిలో ఫుట్ బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేసి క్రీడలను పిల్లలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు.

## ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం



**చింతకాని, ఏప్రిల్ 7(మహా):** చింతకాని మండల పరిధిలో ఉన్న శారీరక దివ్యాంగ చిన్నారులకు ప్రతి బుధవారం క్రమం తప్పకుండానిర్వహించే ఫిజియోథెరపీ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సలాది రామారావు తెలిపారు.మానవసేవయే మాధవసేవ, దివ్యాంగ చిన్నారుల సేవే సర్వజన సేవ కు తప్పనిసరిగా అందరి సహకారం ఉంటేనే ఏదైనా విజయవంతం అవుతుందని ఎంఈఓ అన్నారు. మండలంలోని దివ్యా%శీ%గ చిన్నారులకు ఉన్నతికి సహాయ సహకారాలు అందజేసే వారందరికీ హృదయపూర్వక నమస్కారములు, మన చింతకాని మండల పరిధిలోని శారీరక దివ్యాంగులను ఇంటి చుట్టుపక్కల గాని, తెలిసిన వారు గాని ఉంటే తప్పనిసరిగా ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీ వైద్య శిబిరానికి పంపించి ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి బుధవారంశారీరక వైకల్యం గల చిన్నారులకు ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహణ బుధవారంఉదయం 10గంటల నుండి మన చింతకానిమండల పరిధిలోని లచ్చగూడెం హై స్కూల్ ప్రాంగణంలోఉన్న దివ్యాంగ బాలబాలికల భవితా కేంద్రంలో సంవత్సరం లోపు వయసుగల శారీరక వైకల్యంతో బాధపడుతున్నదివ్యాంగ చిన్నారుల నుండి 19 సంవత్సరంలముల లోపు వరకు వయసు గల శరీరకవైకల్యం కలిగి ఉన్నఈ క్రింది సమస్యలు, పుట్టుకతోనే వచ్చే ఫాక్షిక పక్షవాతం(సెరిబ్రల్ పాలసీ), శరీరంలోని కండరాల మధ్య సమన్వయ లోపంతో బాధపడుతూ కూర్చోడంలోనూ నిలబడడంలోనూ అడుగులు వేయడంలోనూ, నడవడంలోనూ,ఇబ్బంది పడే చిన్నారులకు, మరియు ఇతర శారీరక వైకల్యాల వల్ల తమ పనులు తాము చేసుకోలేని చిన్నారులకు తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహిస్తున్నారు. దీనికి మండల పరిధిలోని శారీరక దివ్యాంగ బాలబాలికలను వారి తల్లిదండ్రులు ఈ ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరానికి తీసుకొని వచ్చి దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా అధికారుల కోరారు. గమనిక:-ఇది పూర్తిగా ఉచిత సర్వీస్ దీనికి మీరు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు గమనించగలరు మరింత సమాచారం కొరకు కే.ఎస్. కృష్ణారావు ఐఆర్పి చింతకానిమండలం, 6302504078 %ఙ% 9492244874, భూక్య దస్లి ఐఆర్పి, చింతకాని మండలం 9701611706, మరియు ఫిజియోథెరపీ వైద్య నిపుణురాలు డాక్టర్ జి వసంత 9618608929,ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి పూర్తి వివరములు తెలుసుకోగలరు.

## మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఏయంఓ రవికుమార్



**బోనకల్,మహా:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఏయంఓ రవికుమార్,మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్,మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్యలు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు,గురుకుల పాఠశాలలో ఉన్న తరగతులను,మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.అనంతరం పిల్లలతో కలసి అధికారులు మధ్యాహ్న భోజనం చేసి మధ్యాహ భోజనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం తాసిల్దార్ పున్నం చందర్ వంటసామాగ్రిని పరిశీలించారు,విద్యార్థుల హాజరు ను పరిశీలించారు,అదే విధంగా పాఠశాల ఆవరణ పరిశుభ్రత,వంటగది ఆవరణ పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి,ఉపాధ్యాయులు పరమేశ్వర్,మరి కొంతమంది ఉన్నారు.

# తుమ్మల పర్ఫార్మెన్స్ ఢిల్లీ దాకా...

### తుమ్మల శ్రమకు తగిన గుర్తింపు.. మీనాక్షి నటరాజన్ నివేదికలో ప్రశంసలు

**ఖమ్మం - మహా:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తిరుగులేని శ్రద్ధా శక్తిగా నిలుస్తున్న వారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. నాలుగు దశాబ్దాల రాజకీయం, ప్రజా సేవ, అవినీతిరహిత పరిపాలన %-% ఇవన్నీ ఆయనకు ప్రజల గుండెల్లో స్థానం కలిగించాయి. ఈయన పనితీరుపై తాజాగా ఏ ఐ సి సి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్వహించిన విశ్లేషణాత్మక సర్వేలో "వెరీ గుడ్" పర్ఫార్మెన్స్ రిపోర్ట్ రావడం పెద్ద సంచలనంగా మారింది. ఇది తుమ్మల వ్యక్తిత్వానికి, విధేయతకు, గ్రామీణ అభివృద్ధిపై ఆయన తీసుకుంటున్న చర్యలకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి వచ్చిన గౌరవంగా చెప్పవచ్చు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతగా వ్యవహరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురించి మీనాక్షి నటరాజన్ ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కార్యదర్శుల పనితీరు సమీక్షలో ఆయనకు మంచి రేటింగ్ ఇచ్చారు. గాంధీ భవన్ వర్గాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం %-% తుమ్మల అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలు, వ్యవసాయ రంగంలో ఆయిల్ పామ్ సాగును లక్షలాది ఎకరాల్లో విస్తరించడమూ, ఖమ్మం జిల్లాలో రైతు జీవన ప్రమాణాలను మెరుగుపరచడం వంటి అంశాలు ఈ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి. వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల గారు, రాష్ట్రానికి అవసరమైన ఆయిల్ పామ్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ, రైతులకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించే విధంగా పనిచేస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ ద్వారా, ప్రత్యేకించి ఖమ్మం జిల్లాలోని చిన్న రైతుల జీవితాల్లో విశేష మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇది తుమ్మల 'విజన్'కు ప్రతిరూపం. తుమ్మల గత నాలుగు దశాబ్దాలుగా పలు పదవుల్లో సేవలందిస్తూ, అవినీతిరహిత పాలనకు దృక్పథంగా నిలిచారు. ఆయన ప్రజల పట్ల నిబద్ధత, నియోజకవర్గ అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ %-% ఇవన్నీ మీనాక్షి నటరాజన్ సమీక్షలో మెరుపులు మెరిపించాయి. ముఖ్యంగా ఖమ్మం, పాలేరు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కొత్త దిశనిచ్చిన తీరును కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత సానుకూలంగా పరిగణించిందని సమాచారం.



### సమగ్ర అభివృద్ధికి నిలువెత్తు ఉదాహరణ...

విత్తనాల పంపిణీ, ఎరువుల సరఫరా, సబ్సిడీ పథకాలు, సాగు నీటి అందుబాటు %-% అన్నింటిలోనూ సమర్థవంతంగా వ్యవహరిస్తూ, వ్యవసాయరంగాన్ని పునరుజ్జీవింపచేయడంలో తుమ్మల గారి కృషి స్పష్టంగా కనిపిస్తుంది. రైతు కుటుంబాల హక్కులను పరిరక్షిస్తూ, రైతుబంధు %-% రైతు భరోసా వంటి పథకాల అమలులో ఆయన్ను ఆదర్శంగా నిలిపే విధంగా, ఆయనపై హైకమాండ్ విశ్వాసం వ్యక్తం చేయడం గర్వకారణం.ఈ నివేదిక వెలువడిన తర్వాత తుమ్మల ప్రాధాన్యత మరింత పెరగనుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. నిష్కళంకమైన పాలన, ప్రజల సమస్యలపై స్పందించే తత్వం, గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేసే దృక్పథం %-% ఇవన్నీ ఆయనను శక్తిమంతమైన నేతగా తీర్చిదిద్దాయి. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణల్లో తుమ్మల గారి ప్రాధాన్యత మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మీనం వలె ప్రశాంతంగా, సింహంలా నాయకత్వం వహించే తుమ్మల పై ప్రజల్లో విశ్వాసం ఎంత వుందో, ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానంలోనూ అదే స్థాయిలో నమ్మకాన్ని సంపాదించుకోవడం అనేది ఈ నివేదిక చూపుతున్న మరో ముఖచిత్రం.

## ఏప్రిల్ 9న ప్రభుత్వ ఉద్యోగాలపై యువతకు అవగాహన

**ఖమ్మం, ఏప్రిల్ -07, మహా:** ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలపై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో అభిరామ్ ఐ.ఏ.ఎస్. అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 9న ఉదయం 9.00 గంటలకు యువతకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రం లో ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫౌండర్ అండ్ డైరెక్టర్ వి. అభిరామ్ సోమవారం తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హాజరై, ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు, వాటి ప్రాముఖ్యతపై యువతకు సూచనలు, ప్రేరణాత్మక ఉపన్యాసం చేస్తారని తెలిపారు.

## ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలి

**నేలకొండపల్లి, ఏప్రిల్ 7 మహా:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్ సూచించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సోమవారం పరిశీలించారు. మస్టర్లను పరిశీలించారు. పథకం యొక్క ఉద్దేశ్యం ను కూలీలకు వివరించారు. నిబంధనల మేరకు పనులు చేయాలని కూలీలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఉపాధి పథకం పనులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ కూలీ కూడ పథకం లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్, మాజీ 'సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ. పథకం మేట్లు పి.కోటయ్య, పాకనాటి సీతారామిరెడ్డి, ఆనం వెంకటరెడ్డి, కర్ల బాలస్వామి, పి.మాధవి, చింతమళ్ల యశోధ, పగడాల సైదులు, బిందె ముత్తయ్య, మందడి చంద్రయ్య, చింతమళ్ల వెంకటరమణ, కె.సుశీల రాయి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి నీటిబిందువు జల సింధువు

- సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల ఏర్పాటు, అభివృద్ధి
- భూగర్భ జలాల పెంపుదలకు ప్రత్యేక ప్రణాళిక
- నీటి కుంటలుగా మూత పడిన ఓ.సి. సంపులు
- ఓవర్ బర్డెన్ గుట్టల మధ్య నీటి తటాకాలు ఏర్పాటు
- ఎండకాలంలో కూడా సింగరేణి ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే ప్రయత్నం
- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశాలు

■ సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటికే బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచాలని, తద్వారా సమీప ప్రాంతాల్లో వాటర్ టేబుల్ (నీటిఫలకం) ను వృద్ధి చేయాలని నిర్ణయించారు.

■ ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంపుల మధ్య ఏర్పడే లోతట్టు ఖాళీ ప్రదేశాలను ఇకపై చిన్నపాటి నీటి తటాకాలుగా తీర్చిదిద్దాలని, వీటిని వర్షపు నీటితో, లేదా ఓపెన్ కాస్ట్ నుండి బయటకు పంపించే నీటితో నింపాలని భావిస్తున్నారు. పైవిధంగా ఏర్పాటు చేసిన జల వనరు కేంద్రాల లోనికి నీరు చేరడానికి, చేరిన నీరు బయటకు పంపించి సద్వినియోగం చేయడానికి కొన్ని సివిల్ నిర్మాణపు పనులు కూడా శాఖాపరంగాచేపట్టాలని నిర్ణయించారు.

■ అలాగే సింగరేణి గని ప్రాంతాలకు వెలుపల 2 కిలోమీటర్ల పరిధిలో ఉన్న తరాల నాటి చెరువులు, కుంటలను కూడా అభివృద్ధి చేయాలని, వాటిలో ఎక్కువ నీరు నిలువ ఉంచేందుకు పూడిక తీయడం వంటి పనులు కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు స్థానిక గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల అంగీకారాన్ని పొంది, ఈ పనుల్లో స్థానికులు పాల్గొనేలా చూడాలని కూడా నిర్ణయించారు.

■ పై చర్యల వల్ల సింగరేణి ప్రాంతంలో భూమి లోపల నీటి ఫలకం పెరిగి జలవనరులు వృద్ధి చెందుతాయని, ఈ నీటిని తాగునీరు, సాగునీటికి కూడా వినియోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని యోచిస్తున్నారు. ఈ తటాకాలు కేవలం జల వనరుల పెంపుదలకు మాత్రమే కాక ఆ ప్రాంత జీవావరణ పరిరక్షణ కూడా ఉపయోగపడతాయని, వీటిలో చేపలు, కప్పలు వంటి జలచరాలను కూడా వృద్ధి చేయవచ్చు అని భావిస్తున్నారు.

■ సింగరేణి ఏర్పాటు చేయనున్న ఈ జల వనరుల కేంద్రాల లోని నీటిని శాస్త్రీయంగా ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ నాణ్యత పెంపుదలకు చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ వారి సూచన మేరకు సింగరేణి సంస్థ ఈ భారీ పర్యావరణహిత పథకాన్ని అమలు చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.

■ ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా, పి అండ్ పి), హైదరాబాద్ కార్యాలయం నుండి ఈడీ (కోల్ మూమెంట్) ఎస్ డి ఎం.సుభానీ, ఫారెస్ట్ అడ్వైసర్ శ్రీ మోహన్ పరిగెన్ పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం - మహా:** పర్యావరణహిత మైనింగ్ ను పాటిస్తూ, కోట్లాది మొక్కలను నాటి దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న సింగరేణి సంస్థ, తాజాగా సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల అభివృద్ధికి "సింగరేణి నీటిబింధువు - జల సింధువు" అనే నినాదంతో ఒక విశిష్ట పరాయవరణహిత, ప్రజోపయోగ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. సకల జీవరాసులకు, పంటలకు ప్రాణప్రదమైన నీటి విలువను గుర్తిస్తూ, మైనింగ్ ప్రాంతంలోనూ, ప్రాంతానికి వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలోను 50 మినీ చెరువులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుత చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్ అన్ని ఏరియాఅ జీఎం లతో, అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశంలో జలవనరుల వృద్ధికి కొన్ని మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ సందర్భంగాఛైర్మన్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ, సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచడం కోసం, సమీప గ్రామాల ప్రజలకు ఎండాకాలంలో సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం, ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసే చర్యల్లో భాగంగా నీటి బిందువు- జలసింధువు అని నినాదంతో జల వనరుల పెంపుదలకు చర్యలు తీసుకోవా లన్నారు. సింగరేణి చేపట్టనున్న చర్యల వల్ల సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని, తాగునీరు ,సాగునీటి అవసరాలకు కూడా ఉపయో గపడతాయని పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపుదలకు తీసుకోవలసిన చర్యలపై చర్చించి ప్రాథమికంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

## జీళ్ళచెరువులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**కూసుమంచి, ఏప్రిల్ 7, మహా:** రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో జీళ్ళచెరువు గ్రామంలో మాజీ ఎంపీటీసీ కాసాని వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పెంద్ర అంజయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు ప్రారంభించారు. కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలోని సీతారామాలయం రోడ్డు బజార్ లో రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈజీఎస్ పథకం నుంచి మంజూరు చేసిన నిధులతో నూతన సీసీ రోడ్డుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీళ్ళచెరువు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంద్ర అంజయ్య, ఇంటూరి పుల్లయ్య, కొండా శ్రీనివాస్ రావు, కాసాని వెంకన్న, గోపగాని వీరబాబు, బాలబోయిన శ్రీనివాస్, దేవాలయ డైరెక్టర్ లు రామడుగు నాగేశ్వరరావు, గుమ్మడెల్లి వెంకన్న,పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల తయారీకి సిద్ధం

**బోనకల్, మహా:** 2025-26 విద్యాసంవత్సరంకు సంబందించి విద్యార్థులకు పాఠశాలలు పునప్రారంభంలో పంపిణీ చేసేందుకు ముందుగా ఏకరూప దుస్తుల వస్త్రంను సోమవారం మండల తాహాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్,మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య ల,మండల కమిటీ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో టైలర్ లకు అందజేశారు.. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిర్దేశిత గొడువులోగా ఏకరూప దుస్తులు అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కట్టా సురేంద్రబాబు మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**సత్తుపల్లి - మహా:** రైతులు కాల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు యాగంటి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. వారం క్రితం సహకార సంఘాలు, ఐకెపి కేంద్రాల ద్వారా ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ పిరికెడు వడ్లు కొనలేదని ఆరోపించారు. ఓ వైపు వాతావరణం బాగోలేనందున రైతులు కల్లాలలో పట్టాలు కొప్పుకొని రాత్రి, పగుళ్లు కాపలా కాస్తూ బిక్కు బిక్కుమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని ధాన్యాన్ని కాంట వేసి రైస్ మిల్లులకు తోలాలని కోరారు.

## ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్గి ఉండాలి

**సత్తుపల్లి - మహా:** మంచి ఆహార అలవాట్లతో పాటు పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆద్వర్యంలో నిర్వహించిన 2 కె రన్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత సెంటర్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు వైద్యులతో కలిసి రన్ లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

## వడగళ్ల వానతో రైతులు అతలాకుతలం

**సత్తుపల్లి - మహా:** అకాల వర్షం రైతులను అతలాకుతనం చేసింది. సోమవారం సాయంత్రం భారీ గాలి దుమారంతో ఒక్కసారిగా వడగళ్ల వాన పడడంతో కల్లాల్లో ఆరబోసిన దాన్యం తడిసిపోవడంతో పాటు గాలి దుమారం కారణంగా మామిడి కాయలు చాలా వరకు రాలిపోయాయి. వడగళ్ల వర్షం పడటంతో మామిడి రైతులకు తీరని నష్టం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం వేడిగా ఉండి ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతుండగా వడగళ్ల వానతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోవటంతో వాతావరణం ఆహ్లాదభరితంగా మారింది. కోతలకు సిద్ధంగా ఉన్న మామిడి రైతులకు ఈ అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది.

## సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలి

**పెనుబల్లి, ఏప్రిల్ - 07, మహా:** రైతులకు ఎలాంటి వాతావరణ పరిస్థితుల ప్రభావం వలన ఇబ్బందులు కలుగకుండా పంటకు లాభాలు పెంచడమే లక్ష్యంగా యంత్రాంగం సమన్వయంతో ముందస్తు కార్యచరణ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, పెనుబల్లి మండలంలో పర్యటించారు. పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలోని లంకాసాగర్ చిన్న తరహా ప్రాజెక్ట్ ను రైతులు, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

FOLLOW: @ANNTELUGU
8-4-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు




# రామయ్య పట్టాభిషేకం









